
రేణింగవరంలో విద్యార్థులచే నులిపురుగుల మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది


స్వర్ణలో అవగాహన కల్పిస్తున్న హెచ్ఈఓ నాగేశ్వరరావు


బాలికల చేత మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

నులిపురుగుల నివారణతో శారీరక ఎదుగుదల

- జాతీయ నులిపురుగుల దినోత్సవం
- ర్యాలీలు నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

చినగంజాం/కారంచేడు/యద్దనపూడి/మార్టూరు: నులిపురుగుల నివారణతో శారీరక ఎదుగుదల సక్రమంగా జరుగుతుందని ఎంపీడీవో కే స్వరూపరాణి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని చినగంజాం సచివాలయం-2 పరిధిలోని కస్తూర్బా బాలికా విద్యాలయంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నులిపురుగుల నివారణ గురించి బాలికలకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. శారీరకంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, రక్తహీనత కలుగకుండా ఉండేందుకు నులిపురుగుల నివారణ తప్పనిసరని వక్తలు బాలికలకు తెలియజేశారు.

కార్యక్రమంలో భాగంగా 271 మందికి అల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంఈఓ బీ అజయ్‌బాబు, ఈఓపీఆర్డీ వేణు, జూనియర్ అసిస్టెంట్ వేణు, కార్యదర్శి యూ సుబ్బారావు, ఏఎన్ఎం స్టాన్లీ దేవి, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.


వేటపాలెం: చిన్నారులకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

■ ప్రతి ఒక్కరూ కడుపులో ఉండే నులిపురుగుల నివారణకు అవసరమైన ఆల్‌బెండోజోల్ మాత్రలు వేసుకోవాలని కారంచేడు ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు యూపీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో మాత్రలను మింగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో 1181 మందికిగాను 1173 మంది చిన్నారులకు మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ వీ వీరమ్మ, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో 1016 మందికిగాను 1009 మంది చిన్నారులకు మాత్రలు మింగించామని హెచ్ఈఓ వీ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, హైస్కూల్ హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, ఆశలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంతరావూరులో మాత్రలు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ హిమబిందు

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి..

జే.పంగులూరు/మేదరమెట్ల/అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ: నులిపురుగుల నుంచి రక్షణకు చేతి గోళ్లను వారానికొకసారి తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివచెన్నయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివచెన్నయ్య మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ మాత్రలు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత తీసుకోవాలని తెలిపారు.

6,838 మందికి ఆల్‌బెండ్‌జోల్ మాత్రల పంపిణీ..

వేటపాలెం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 6,838 మందికి ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి స్వాతికిరణ్ తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ 1-19 ఏళ్ల లోపు పిల్లలుకు మాత్రలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జే సుధాకర్, ఏఎన్ఎం ఉషారాణి, ఆశ వర్కర్స్ కుసుమ, గాయిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం మండలం సంతరావూరు ఎంపీయూపీ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ హిమబిందు ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

శుభ్రతతోనే ఆరోగ్య భారతం సాధ్యం


అద్దంకిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది


మేదరమెట్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విద్యార్థులు

- గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- జోరుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/కొరిశపాడు: గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య భారతాన్ని చూడవచ్చని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించారు. మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీ వరకు కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఉపసర్పంచ్ మన్నె దుర్గారావు, ఈవో లక్ష్మీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– పరిసరాల పరిశుభ్రతను అందరి బాధ్యతగా చేపట్టాలని అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్టీసీ సిబ్బంది, పాఠశాల సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం విద్యార్థులు మానవహారం నిర్వహించారు.

■ బల్లికురవ ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమతి, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో మన వంతు కృషిఉండాలి..


చీరాలలో కార్యదర్శులకు సూచనలందిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కారంచేడు/చినగంజాం/మార్టూరు: మన ఇంటి పరిసరాల పరిశుభ్రతలో మన వంతు కృషి ఉండాలని ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఎంపీడీఓ కార్యాలయం నుంచి కాలువ సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, ఎం వెంకటేశ్వర్లు, పీఆర్ జేఈ రామచంద్రుడు, ఏఈ హౌసింగ్ ఖాశీం సాహెబ్, సచివాలయాల సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చీరాల టౌన్: ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవా సేవను అన్ని గ్రామ పంచాయతీల్లో సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో స్వచ్ఛతా హీ సేవా-2024పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, పంచాయితీ సెక్రటరీలు శ్రీను, ఇమ్రాన్, వెంకటేశ్వరరావు, మాధవి, బేగం, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కుక్కల స్వైర విహారం

అద్దంకి: పట్టణంలో వీధికుక్కలతో పాటు పెంపుడు కుక్కలు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. మంగళవారం పట్టణంలోని బెల్ అండ్ బెనెట్ పాఠశాల సమీపంలో సూర్యప్రకాష్ కుటుంబం నివసిస్తోంది. ఈ క్రమంలో ఈ క్రమంలో అతని కుమారుడు సుజన మోహన్ ఇంటి బయటకు వచ్చి ఆడుకుంటుండగా వీరి ఇంటికి సమీపంలో నివశిస్తున్న రెండు ఇళ్లకు చెందిన కుక్కలు అక్కడకు వచ్చిన బాలుడిని కరిచాయి. గాయాలపాలైన బాలుడిన తండ్రి వైద్యం కోసం వైద్యశాలకు తీసుకుని వెళ్లాడు. పెంపుడు కుక్కలను ఇంట్లో కట్టివేయడం చేయాల్సింది పోయి వీధుల్లో వదిలితే పిల్లలను కరుస్తున్నాయని తగు చర్యలు మున్సిపాలిటీ వారు తీసుకోవాలని బాలుని తండ్రి కోరుతున్నాడు.

20 తేదీన మెగా జాబ్ మేళా

అద్దంకి: పట్టణంలోని పాలిటెక్నిట్ కళాశాలలో ఈనెల 20వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కే సాహిల్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో మాస్టర్ మైండ్స్, కల్లమ్ టెక్స్‌టైల్స్, కేఎల్ గ్రూప్ కంపెనీతో పాటు ఇతర కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన 18 నుంచి 25 సంవత్సరాల్లోపు వారంతా హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 94406 35677, 95429 70871 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ప్రకటనలో చెప్పారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు అందుతున్నాయి. దానిలో భాగంగా మంగళవారం జే పంగులూరు మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ రూ.1 లక్ష విరాళంగా ఆలయ ఏసీ సుభద్రకు అందజేశారు.

వరిగడ్డి వామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

చీరాల: పట్టణంలోని హరిప్రసాద్‌నగర్‌లోని ఇళ్ల మధ్య ఉన్న వరిగడ్డి వామి మంగళవారం దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని పేరాల హరిప్రసాద్‌నగర్‌లో కొత్తగొర్ల శ్రీనివాసరావుకు చెందిన పది ఎకరాల గడ్డి వామికి మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ రావడంతో స్థానికులు గుర్తించారు. నీళ్లతో మంటలార్పేందుకు ప్రయత్నించారు. ఎండ వేడిమి కూడా ఉండడంతో మంటలు వ్యాపించాయి. ఫైర్ ఆఫీసుకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేశారు. ఈప్రమాదంలో రూ.1 లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

సకల కళలు, వృత్తులకు ఆద్యుడు విశ్వకర్మ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు


మార్టూరులో నిర్వహిస్తున్న విశ్వకర్మ శాంతి యజ్ఞం


చీరాలలో విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సంఘసభ్యులు

- ఘనంగా విశ్వకర్మ జయంతి

మార్టూరు: సకల కళలు, వృత్తులకు ఆద్యుడు విశ్వకర్మ అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా శాంతి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక ద్వారా నంది పురస్కారం అందుకున్న వినుకొండ లింగాచారిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మచ్చా అనంతాచారి, కొండిపర్తి వినయ్, అమ్మ ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందు , పద్మావతి తదితర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వకర్మకు నివాళులు..

చీరాల/చీరాల అర్బన్: విశ్వకర్మ జయంతి వేడుకలను స్థానిక విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చీరాల-పేరాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటి హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడలి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

■ విశ్వకర్మ జయంతి వేడుకలను చీరాలలోని పాపరాజుతోటలోని బాపనమ్మ కళ్యాణ మండపంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ కమిటీ సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంగం ఆధ్వర్యంలో స్థానిక కమఠేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం 21 మంది దంపతులచే పూజలు, అనంతరం అన్నదాన వితరణ చేశారు.

ఎయిడ్స్‌పై లారీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

చీరాల టౌన్: వివిధ దూరప్రాంతాలకు ప్రయాణం చేసే లారీ డ్రైవర్లు ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మహిళా మండలి ఓఆర్‌డబ్ల్యూ కె.జ్యోతి సూచించారు. మంగళవారం స్థానిక కారంచేడు రోడ్డులోని ది చీరాల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో లారీ డ్రైవర్లకు చీరాల మహిళా మండలి టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు ఎయిడ్స్, హెచ్ఐవీ సంక్రమణలపై 'మీకు తెలుసా' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రతినిధి జ్యోతి మాట్లాడుతూ లారీ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ ఫ్యామిలీకి దూరంగా ఉంటారని వీరిని ఆకర్షించేందుకు హైవేలపై పలుర కాల అసాంఘిక కార్యకలాపాలు చేసేవారు ఉంటారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్లతో పాటుగా మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.


కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న మహిళా మండలి ప్రతినిధులు

సమాజ సేవలో రోటరీ ముందంజ

ఇంకొల్లు (చినగంజాం): సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మార్టూరు, చిలకలూరిపేట రోటరీ క్లబ్ సంయుక్త సహకారంతో పాఠశాల విద్యార్థులకు రూ 1.50 లక్ష విలువ కలిగిన 45 బల్లలను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌చార్జ్ హెచ్ఎం పెంట్యాల పావని అధ్యక్షత వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గోరంట్ల పున్నయ్య 25 శాతం నగదు సమకూర్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ ఎం సాంబశివరావు, సీనియర్ రొటేరియన్ జేవీ మోహనరావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఆంజనేయులు, ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ కే రవిబాబు, పూర్వపు అధ్యక్షుడు రావి అంకమ్మచౌదరి, సీనియర్ రోటేరియన్ పీ ఆంజనేయులు పాల్గొన్నారు.



పాఠశాలలో మాట్లాడుతున్న రోటరీ అధ్యక్షుడు కోటేశ్వరరావు

టౌన్, రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ఎంపిక

చీరాల రూరల్: చీరాల టౌన్, రూరల్ పాస్టర్స్ అసోసియేషన్‌ను మంగళవారం పట్టణంలోని జవహర్ నగర్‌లో పాస్టర్ రత్నరాజు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ పి. రతన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్. దాసు, సెక్రటరీగా పి. వసంతరావు, జాయింట్ సెక్రటరిగా ప్రభాకర్, ట్రెజరర్‌గా జయకుమార్, సలహాదారులుగా పాస్టర్ రమేష్, పాస్టర్ దేవసహాయం, పాస్టర్ అరోగ్యం, జయకుమార్, గౌరవ అధ్యక్షుడిగా పాస్టర్ అలెక్స్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమానంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అసోసియేషన్ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని నూతన ప్రతినిధులు పేర్కొన్నారు.


ఎన్నికైన పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆటోను ఢీకొన్న బైకు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

మేదరమెట్ల: ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన మోటారు బైకు ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు మోటారు బైకుపై ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. క్రాస్‌రోడ్డు జాతీయ రహదారి వద్దకు రాగానే బైకు అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న అవినాష్, లిల్లీలకు రక్తగాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఇరువురినీ ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులు అవినాష్‌ది రెంటచింతల గ్రామం కాగా, లిల్లీది గుంటూరుగా హైవే పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

కారంచేడు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారిలో కారంచేడు గ్యాస్ గోదాముల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వీ వెంకట్రావు వివరాల మేరకు.. చీరాల వైపు నుంచి పర్చూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీస్‌లను సమాచారం అందించారు. తన సిబ్బందితో వచ్చిన ఎస్ఐ క్షతగాత్రుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ద్వారా డీ సాంబశివరావు వెంగళాయపాలెం అన్నట్లు ఉందన్నారు. ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువకుడు ఎటు నుంచి ఎటు వెళ్తున్నాడు, ఎటు వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొందో తెలియదన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని వెంటనే 108 సాయంతో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.


క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

సంక్షిప్తంగా

సామూహిక అనంత పద్మనాభస్వామి వ్రతాలు

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సామూహిక అనంత పద్మనాభస్వామి వ్రతాలు మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు స్వామి వారికి సామూహిక వ్రతాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అత్తింటిపై కోడలు ఫిర్యాదు

మార్టూరు: భర్త అతని బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ మహిళ మార్టూరు పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. మార్టూరు మండలం ఇసుక దర్శి గ్రామానికి చెందిన శిరీషకు తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందినవడ్డెం గుంట సుబ్బారావుతో చాలా కాలం క్రితం వివాహం జరిగింది. శిరీషను అదనపు కట్నం తీసుకురావాలంటూ అతని తరపు బంధువులు శారీరకంగా, మానసికంగా తరచూ వేధిస్తుండేవారు. ఈ క్రమంలో చివరిసారిగా శిరీషను అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాల్సిందిగా ఇంటి నుంచి బయటకు గెంటివేయడంతో సుమారు ఒకటిన్నర సంవత్సరం నుంచి ఇసుక దర్శిలోని పుట్టింట్లో తన పిల్లలతో కలిసి ఉంటుంది. పెద్ద మనుషులు ఎన్నిసార్లు రాజీ చేసినా భార్య,పిల్లల్ని కనీసం పట్టించుకోలేదు. శిరీషా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

ఓజోన్‌తో పర్యావరణ రక్షణ

అద్దంకి: పట్టణంలోని కట్టా రామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం అంర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అధ్యక్షత వహించారు. ప్రయోక్తగా బోటనీ అధ్యాపకుడు ఎస్‌కే మస్తాన్ వలి వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొరతో మనిషి జీవనం ముడిపడి ఉందన్నారు. దానికి గతంలోనే చిల్లు పడిన విషయాన్ని గుర్తు చేశారు. విచ్చలవిడి కాలుష్యాన్ని తగ్గించి ఓజోన్ పొర దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో ఎక్కువ పోషకాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమ

చీరాల అర్బన్: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే తృణధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వేటపాలెం ప్రాజెక్టు సీడీపీవో ఉమ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ముత్యాలపేట, గొల్లపాలెం, కటకంవారివీధి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు సమతుల పౌష్టికాహారం అందించడం వలన భావి తరాల్లో మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుముద్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై

వేటపాలెం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పందిళ్లపల్లి నుంచి అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్సై అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటనష్ట వివరాలు పూర్తి

చీరాల రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చీరాల, వేటపాలెం మండలాలలో పంట నష్టపోయిన రైతులకు రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు పంటనష్ట వివరాలు పూర్తిచేసినట్లు చీరాల మండల వ్యవసాయ శాఖ అధికారి సుమతి మంగళవారం పేర్కొన్నారు. వాడరేవు, బుర్లవారిపాలెం గ్రామాల్లో 45 మంది రైతులకు సంబంధించి 66.44 ఎకరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 2.66 లక్షల కోసం అధికారులకు నివేదిక అందించినట్లు చెప్పారు. ఈ-పంట నమోదుకు ఈనెల 23 వరకు గడువు విధించినట్లు చెప్పారు. అలానే ఖరీఫ్‌లో 1164 గాను ఈఏడాది 682 ఎకరాలు సాగుచేశారని, వాటిలో మినుము 74 ఎకరాలు, వరి 300 ఎకరాలు, వేరుశనగ 38 ఎకరాలు ఈ-పంట నమోదు చేశారని చెప్పారు. అలానే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 326 మిల్లీ మీటర్లు కాగా 241 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.